క్లుప్తంగా

శృతిలయ సమన్వితం... త్యాగరాజ సంకీర్తనం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీతసభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257 వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని సంగీత విద్వాంసులు కచేరీలో పాల్గొని ఉత్సవాలకు శోభను అందిస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమంలో కె.శర్వాణి, శృతిలయ నివాస్ విద్యార్థులు, మంత్ర ప్రగడ దుర్గా ప్రమీల, కె.శ్రీవిద్య, కె.అనిల్‌కుమార్ డీవీఆర్ సీత, పోపూరి శ్యామసుందర్, వీరుభట్ల సీతారమణి, గండూరి లక్ష్మీ హర్షిత, సాయి కృష్ణ కౌశిక్, ముళ్ళమూడి శ్రీనిధి, విష్ణుభొట్ల సోదరీ మణులు త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. కేవీఎస్ గోవిందరాజన్ వీణపై త్యాగరాజ కృతులను ఆలపించారు. సంగీతోత్సవంలో 6 సంవత్సరాల శర్వాణి నుంచి 85 సంవత్సరాల రఘునాథరావు వరకు వివిధ వయసుల వారు పాల్గొనటం విశేషం. సంగీత కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వెంపటి పెద్ద సత్యరామ కూచిపూడి అకాడమీకి చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అన్నంభోట్ల శోభ బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ధర్మపథం వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం పలువురు భక్తులను చిన్నారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: పుష్పాంజలి రిథమ్స్ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆలరించింది. సీనియర్ గాయకుడు బాలాజీ కుమార్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు సుధారాణి, లక్ష్మీ దుర్గ, దుర్గ, నాగలక్ష్మి, గెల్లి సువర్ణ, బోయిన వేణుగోపాల్, గాయత్రి శర్మ, విజయశ్రీ గుప్తా తదితరులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. బాలాజీ కుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

వృద్ధులకు అన్నసమారాధన

గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక బేతవోలు శాంతి వృద్ధుల ఆశ్రమంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. క్లబ్ సభ్యుడు చందన వేణునాయుడు వితరణతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కె.రామకృష్ణ, సభ్యులు పి.సత్యన్నారాయణ, బొగ్గారపు తిరుపతయ్య, వంగపండు బ్రహ్మాజీ పాల్గొన్నారు.

దానియేలు సేవలు ఆదర్శప్రాయం

పామర్రు: ప్రముఖ పాస్టర్ ఎం.దానియేలు చేసిన సేవలను పాస్టర్లు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల అన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో పామర్రు, నల్లగుంటకు చెందిన పాస్టర్ దానియేలును గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రభువు సేవతో పాటు సమాజానికి కూడా ఎనలేని సేవలను అందించి దానియేలు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయటం, పేదలకు ఉచితంగా ఆహారం, వస్త్రాలను అందించడం వంటి ఎన్నో సేవలను అందించారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఆవుల ప్రవీణ్, కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై గురువారం దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణ, పూజల్లో ఈవో రామరావు పాల్గొన్నారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వరశాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, ఇతర ఆలయ అర్చకులు పూజలు జరిపించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో పూజ జరిపించుకున్నారు.

శరవేగంగా ఫ్లై ఓవర్ పనులు

- నెరవేరనున్న గుడివాడ ప్రజల చిరకాల వాంఛ
- నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు తెర
- రూ.320 కోట్లతో నిర్మాణం
- అక్టోబర్ చివరి నాటికి పూర్తిచేసే యత్నం



గుడివాడ-మచిలీపట్నం మార్గంలో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా పూర్తయిన పిల్లర్లు

గుడివాడటౌన్: గుడివాడ నియోజకవర్గం పరిసర ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణం త్వరలోనే నెరవేరనుంది. గుడివాడ రైల్వే కూడలి కావడం, పలు ప్రాంతాలకు గుడివాడ నుంచి రైల్వే లైన్ విస్తరించి ఉండటంతో ఈ మార్గంలో రైళ్ల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. దీనికి తోడు పట్టణంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడంతో నిత్యం రద్దీ పెరిగింది. ఇక రైల్వేశాఖ గుడివాడ నుంచి భీమవరం, మచిలీపట్నం వైపు వెళ్లే రైల్వేలైన్ డబ్లింగ్ చేసి ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చెయ్యడంతో రైళ్ల రాకపోకలు పెరగడం, సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను గుడివాడ మీదుగా మళ్లించారు. గుడివాడ రైల్వేలైన్ లూప్ లైన్ కావడంతో సుదీర్ఘ ప్రాంతాలకు గూడ్స్ రైళ్లు భారీగా పెరిగాయి. కొత్తగా రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయంతో గూడ్స్ రైళ్లు 120 నుంచి 140 బోగీలతో ప్రయాణం చేస్తున్నాయి. దీంతో రైల్వేగేట్ వేస్తే కనీసం అరగంట పైబడి ప్రజలు రోడ్లపై ఎండలో, వానలో ఉండి ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పలుమార్లు చర్చించారు. గుడివాడ వైపు నుంచి వెళ్లే మచిలీపట్నం- కల్లూరు, ఒంగోలు - కత్తిపూడి జాతీయ రహదారులకు పట్టణంతో సంబంధం లేకుండా రహదారి విస్తరణ జరిగింది. ఈ నేపథ్యంలో రైల్వే ఫ్లై ఓవర్‌కు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం సాధ్యపడదని రైల్వే అధికారులు నివేదిక సమర్పించినప్పటికీ కొడాలి నాని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి ఫ్లై ఓవర్‌కు నిధులు వచ్చేలా కృషి చేశారు. చిట్టచివరకు రైల్వేశాఖ, జాతీయ రహదారుల శాఖ నుంచి రూ.320 కోట్ల రూపాయలతో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి అనుమతులతో పాటు నిధులు సైతం మంజూరు చేయించారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2024 అక్టోబర్ చివరి నాటికి ఫ్లై ఓవర్ పనులు పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన పరికరాలతో వేలాదిమంది సిబ్బందితో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు రేయింబగళ్లు కొనసాగిస్తున్నారు. అనుకున్న సమయానికి నిర్మాణం పూర్తయి జాతికి అంకితం అవుతుందని గుడివాడ పరిసర ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



అధునాతన పరికరాలతో నిర్మాణం పనులు

గుడివాడకు ఒక మైలురాయి కానుంది



గుడివాడ పట్టణ ప్రజలకు ఫ్లై ఓవర్ నిర్మాణం ఒక మైలురాయి కానుంది. సుమారు 40 సంవత్సరాలకు పైగా ప్రజలు ఈ రైల్వేగేట్‌ల వద్ద అవస్థలు పడుతున్నారు. పట్టణం విస్తరించడం, వాహనాలు పెద్ద సంఖ్యలో పెరగడంతో ఈ అవస్థలు మరింత పెరిగాయి. నిర్మాణం పూర్తయితే ప్రజలు నిర్మాణం పూర్తిచేసిన వారిని చిరస్థాయిగా గుర్తుంచుకుంటారు.

– ఎం.చిననారాయణ రెడ్డి, స్థానికుడు

• సరదా... సరదాగా..



సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని గత కొంతకాలంగా మండుటెండలో అవిశ్రాంతంగా ప్రయాణాలు, వందల కిలోమీటర్ల నడక.. క్షణం తీరిక లేకుండా గడపిన అభ్యర్థులకు విశ్రాంతి లభించింది. ఎన్నికలు ముగియడంతో కుటుంబ సభ్యులతో కలసి సరదా సరదాగా గడుపుతున్నారు. కైకలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) గురువారం కైకలూరులోని తన నివాసంలో చిన్న మనవడు కార్తీక్‌తో ఉల్లాసంగా గడుపుతుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది. –కైకలూరు

వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం

తోట్లవల్లూరు: అరవై ఏళ్ల వయస్సు నిండిన వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలియజేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాలతో స్థానిక పీహెచ్‌సీలో వయోజనులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ప్రతి గురువారం వయోజనులకు ఆరోగ్య ఉపకేంద్రాలలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తామని డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. గత ఐదేళ్లలో టీబీ చరిత్ర కలిగిన వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, గతంలో, ప్రస్తుతం ధూమపానం చేసే వ్యక్తులకు ఈ టీకా వేస్తామని ఆమె చెప్పారు. డెంగీ దినోత్సవం పురస్కరించుకుని దోమల నివారణపై అవగాహన కలిగించినట్లు డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, పీహెచ్‌ఎన్ పద్మావతి, ఎంపీహెచ్‌ఎస్‌లు అనిల్‌కుమార్, రోహిణి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

టీబీ టీకాల పంపిణీ పరిశీలించిన డీఎంహెచ్‌వో

పెదపూడి(మొవ్వ): కృష్ణాజిల్లాలో 2025 నాటికి టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోందని, ఇందులో భాగంగా టీబీ నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి తెలిపారు. మొవ్వ మండలం పెదపూడి గ్రామంలోని హెల్త్ సెంటర్‌లో గురువారం జరుగుతున్న టీబీ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. జిల్లాలో 50వేల మందికి ఈ టీకాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ప్రతి గురువారం సమీపంలో ఉన్న సచివాలయాల్లో ఈ టీకాను అందిస్తామని డీఎంహెచ్‌వో వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.సుబ్రమణ్యం, డబ్ల్యూహెచ్‌వో డాక్టర్ టి.ధీరజ్, మొవ్వ వైద్యాధికారి ఎం.వేదరాజ్, డీటీఈవో ఎ.వెంకటరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాలరావు, సీహెచ్‌వో డి.శంకరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పెదపూడిలో టీబీ టీకాల పంపిణీని పరిశీలించిన డీఎంహెచ్‌వో గీతాబాయి

బాబాకు విశేషపూజలు

పామర్రు: వైశాఖ మాసం తొలి గురువారం కావడంతో స్థానిక సాయినగర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తొలుత ఆలయంలో బాబా వారికి కాగడ హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. ఆవుపాలతో, పంచామృతాలతో, నవరసాలతో విశేషంగా బాబాకి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శతనామ అష్టోత్తరాలతో పూజలు చేసి పలు రకాల పువ్వులతో బాబాని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బాబాని కొలిచారు. మధ్యాహ్న హారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం వచ్చిన భక్తులు అందరికీ అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు పావులూరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తమ్మా వినోద్ తెలిపారు. కార్యక్రమంలో షిర్డిసాయి భక్త మండలి సభ్యులు బి.రామకృష్ణారెడ్డి, ఎ.అంజిరెడ్డి, మధు, సాయి, రాధాకృష్ణ, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఐనంపూడిలో...

గ్రామంలో ఉన్న శ్రీ షిర్డిసాయిబాబా మందిరం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజాదికాలను నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిని భక్తి శ్రద్ధలతో కొలిచారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పమిడిముక్కల: మండల పరిధిలోని విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గురువారం గోపువానిపాలెం అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. బంటుమిల్లికి చెందిన ఎస్‌కే షకీల్ బైక్‌పై ఉయ్యూరు నుంచి పామర్రు వైపు వెళుతుండగా గోపువానిపాలెం అడ్డరోడ్డు వద్ద నున్న బారికేడ్‌ను ఢీకొన్నాడు. తలకు గాయం తగలడంతో, స్థానికులు 108కు ఫోన్ చేసి ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాయిదా పడిన గ్రామసభలను నిర్వహించాలి

మండవల్లి: ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 14న నిర్వహించవలసిన గ్రామసభలు వాయిదా పడ్డాయని, వాటిని ఈ నెలలో నిర్వహించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు విజ్ఞప్తి చేశారు. స్థానిక గ్రంథాలయం వద్ద గురువారం వారు మాట్లాడుతూ గ్రామ సభలు గ్రామాభివృద్ధికి, మౌలిక వసతుల ఏర్పాటుకు, సమస్యల పరిష్కారానికి ఎంతో దోహద పడతాయన్నారు.

స్వాతంత్య్ర స్ఫూర్తికి చిహ్నం మండవల్లి గాంధీ ఆశ్రమం



గాంధీ ఆశ్రమంలో గాంధీజీ విగ్రహం



మండవల్లిలోని గాంధీ ఆశ్రమం

మండవల్లి: మండవల్లిలోని గాంధీజీ ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. గాంధీజీ ఆశయాలకు స్ఫూర్తిగా ఆనాటి స్వాతంత్య్ర సమరయోధులు మానేపల్లి మల్లికార్జున గుప్తా, యెర్నేని సుబ్రహ్మణం మండవల్లిలో గాంధీ ఆశ్రమాన్ని నిర్మించారు. ఈ ఆశ్రమం స్వాతంత్ర సిద్ధికి ముందే ఏర్పాటు చేశారు. పూజ్య బాపూజీ ఈ దారిన వెళుతూ ఆశ్రమానికి విచ్చేసినట్లు పెద్దలు చెబుతున్నారు. మల్లికార్జున గుప్తా, యెర్నేని సుబ్రహ్మణ్యం గాంధీజీ శిష్యరికంలో సబర్మతీ ఆశ్రమంలో కొన్నాళ్లు గడిపారు.అనంతరం గ్రామానికి విచ్చేసి గ్రామ ప్రముఖులు అందజేసిన ఐదున్నర ఎకరాల స్థలంలో ఆశ్రమాన్ని నిర్మించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, క్షమ, త్యాగం, కరుణ, ప్రేమ ప్రజల్లో వెల్లివిరిసే విధంగా వీరు కృషి చేశారు. మల్లికార్జున గుప్తా బ్రహ్మచర్యంతో ఉండి, తన జీవితమంతా ఆశ్రమ అభివృద్ధికే ధారపోశారు. ఆశ్రమంలోనే అశువులు బాశారు. ప్రస్తుతం ఎకరం స్థలంలో గాంధీజీ ఆశ్రమం, మూడు ఎకరాల్లో చేపల చెరువు, రెండున్నర ఎకరాల్లో వరిపొలం ఉన్నాయి. చేపల చెరువు, వరిపొలం రెండు సంవత్సరాల కొకసారి బహిరంగ కౌలు వేలం పెడతారు. ఆ కౌలు సొమ్ముతో స్వాతంత్య్ర దినోత్సవం, గాంధీ జయంతి వంటి వాటిని నిర్వహిస్తారు. ఆశ్రమంలో గాంధీజీ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఎండోమెంట్స్ ఈఓగా కొవ్వాడ దివ్యశ్రీ వ్యవహరిస్తున్నారు.

గతంలో ఆశ్రమంలో కుటీర పరిశ్రమలు

గతంలో ఆశ్రమంలో నూలు వడకుట, మల్బరు తోటల పెంపకం, మొక్కల పెంపకం వంటి కుటీర పరిశ్రమలు నిర్వహించేవారు. దీంతో ఈ పరిశ్రమల ద్వారా పలు కుటుంబాలకు జీవనోపాధికి లోటు లేకుండా ఉండేది. గాంధీజీ ఆశయాలకనుగుణంగా గాంధీజీ ఆశ్రమానికి పూర్వ వైభవం తేవాలని ప్రజలు కోరుతున్నారు.

విధ్వంసాలకు కారణం టీడీపీయే

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు



విలేకరులతో మాట్లాడుతున్న మండలి హనుమంతరావు తదితరులు

గుడివాడటౌన్: ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసాలకు ప్రతిపక్ష నాయకుడు, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కారణమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. ఆయన గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా రానున్నాయని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతున్నారనే దుగ్ధతో చంద్రబాబునాయుడు తన కార్యకర్తల ద్వారా ఈ అరాచకాలకు తెర లేపారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వారా ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని పదే పదే అధికారులను మార్చడం వంటి కార్యక్రమాలు చేయించారని, దీంతో అధికారులు వ్యక్తిగతంగా ఎక్కడ ఇబ్బందులు పడాల్సివస్తుందోనని మౌనం దాల్చారని ఆరోపించారు. రాష్ట్రంలో తీవ్రమైన అలజడులు సృష్టించి కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే తలంపుతో ఈ కుట్రలు చేస్తున్నారన్నారు. ఎన్ని అలజడులు సృష్టించినా, రెచ్చగొట్టే కార్యక్రమాలు చేసినా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేశాలకు గురి కావద్దని, సంయమనం పాటించాలని సూచించారు. వచ్చేది జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమే కనుక కార్యకర్తలు ఓర్పుతో ఉండాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, అల్లం రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



పమిడిముక్కల గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



పమిడిముక్కల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పమిడిముక్కల: ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ అధీనంలో ఉన్న అన్ని గ్రంథాలయాల్లో గురువారం నుంచి పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు జూన్ 7వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ వేసవి శిబిరంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు వేసవి శిబిరాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని గ్రంథ పాలకులు కోరుతున్నారు. మండలంలోని పమిడిముక్కల, కపిలేశ్వరపురం, పెనుమత్స, గురజాడ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకులు తెలియజేశారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తోట్లవల్లూరు: వర్షం రాకతో వాతావరణం చల్లబడింది. మండల వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతం కావటంతో పాటు చల్లటిగాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో గత కొద్ది రోజులుగా ఎండవేడి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం రాక మంచి ఆహ్లాదాన్ని పంచింది. వాతావరణం చల్లబడటంతో జనం కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే మొక్కజొన్న కల్లాల్లో ఆరబెట్టిన రైతులు మాత్రం ఆందోళనకు గురయ్యారు. ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు పాడవకుండా రైతులు ఆగమేఘాల మీద పొలాలకు పరుగులు పెట్టి పరదాలు, టార్పాలిన్‌లు కప్పారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాట

- వేసవి సెలవుల్లో... సరికొత్త కోర్సుల్లో...
- కంప్యూటర్ శిక్షణపై విద్యార్థుల మొగ్గు
- స్వల్పకాలిక కోర్సులపై ఎక్కువగా ఆసక్తి



కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినిలు

పామర్రు: వేసవి సెలవుల్లో ఏడాది పాటు పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇప్పుడు వాటిని అటకెక్కించారు. కొంత మంది సెలవుల ఆరంభంలో బంధువుల ఇళ్లకు చెక్కేస్తే మరికొంత మంది పర్యాటక ప్రదేశాలకు, తీర్థయాత్రలకు కుటుంబాలతో తరలివెళ్లారు. ఊళ్ల నుంచి తిరిగి వచ్చి ఇప్పుడు ఉన్న ఖాళీ సమయాన్ని సమర్థంగా సద్వినియోగం చేసుకునే పనిలో పడ్డారు. చాలా మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో చేరి భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. విద్యార్థులు ఎక్కువగా స్వల్ప కాలిక కోర్సులపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో కంప్యూటర్ శిక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో మంచి ప్రతిభ కనబర్చడానికి విద్యార్థులు వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులను ఆకర్షించేందుకు శిక్షణ కేంద్ర నిర్వాహకులు సైతం వివిధ కోర్సులకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 8 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయి.

వివిధ కోర్సులు...

ఈ శిక్షణ కేంద్రాలలో కంప్యూటర్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు సీసీఏ, డీసీఏ, పీజీడీసీఏ, జావా,"సీ-లాంగ్వేజ్, ట్యాలీ, ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ఇంటర్నెట్, హార్డ్‌వేర్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నారు. ప్రాథమికస్థాయిలో కంప్యూటర్ విద్యపై పరిజ్ఞానం పెంచుకుంటే ఉన్నత విద్యల్లో విద్యార్థులు మంచి ప్రతిభ చూపుతారని తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇప్పిస్తున్నారు.

నామమాత్రపు ఫీజులతోనే...

వేసవిలో ఖాళీ సమయంలో వస్తున్న విద్యార్థుల కోసం పలు కంప్యూటర్ శిక్షణ సంస్థలు తక్కువ ఫీజులతోనే బోధన చేస్తున్నారు. ప్రాథమిక అంశాలకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు, ఎంఎస్ ఆఫీస్, పీజీడీసీఏ లాంటి కోర్సులకు రూ.2,500 నుంచి రూ.4వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం మేరకు కొన్ని శిక్షణ సంస్థలు పేద విద్యార్థులకు ఉచితంగానే బోధన చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 3వేల మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు.

ప్రమాణాలు పెంచుకునేందుకు...

భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు ఈ శిక్షణ చాలా అవసరం. అందుకే కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నాను.

–సౌమ్య, విద్యార్థిని

కంప్యూటర్ కోర్సులపై ఆసక్తితో...

పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్య ఎంతో అవసరం. ఉన్నత విద్యతో పాటు కంప్యూటర్ శిక్షణ పొందుతున్నాను.

–సుబ్బలక్ష్మి, విద్యార్థిని